

ఎర్రకాల్వ ప్రాజెక్టుకు ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి - భీమవరం

వర్షపాతం కొనసాగడం, రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో మరింత పెరిగే ఎర్రకాల్వ ప్రాజెక్టు గేట్లు తెరుస్తామని ఏలూరు జిల్లా జలవనరులశాఖ ఎస్ఇ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంగువారిగూడెం నుంచి ఎర్రకాలువ ప్రాజెక్ట్ దిగువ భాగంలోని మండలాలైన జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, నల్లజర్ల, తాడేపల్లిగూడెం, నిడదవోలు మండలాల్లోని రెవెన్యూ ఇరిగేషన్, ఇతర అధికారులు ఈ వరద హెచ్చరికను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎర్రకాలువ రిజర్వాయర్ (కొంగువారిగూడెం) నీటి మట్టం 80.55 అడుగులకు చేరుకుందని, గరిష్ట నీటి మట్టం 83.50 అడుగులు అని తెలిపారు. 3183 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని పేర్కొన్నారు.

వరద గుబులు..!

- తగ్గుతూ.. పెరుగుతూ..
- పరుగులు పెట్టిస్తున్న గోదావరి
- జల్లేరు, తమ్మిలేరు, ఎర్రకాల్వ ప్రాజెక్టులకు పోటెత్తిన వరద
- కివ్వాక పునరావాస కాలనీకి కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితులు
- భద్రాచలం వెళ్లే బస్సులు కుక్కునూరు వరకే
- ప్రమాదపుటంచున లంక గ్రామాలు



ఆచంట మండలం భీమలాపురం వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద ప్రజల్లో గుబులు పుట్టిస్తోంది. తగ్గుతూ..పెరుగుతూ గోదావరి వరద ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని లంక గ్రామ ప్రజలను భయపెడుతోంది. ఏజెన్సీలోని తమ్మిలేరు, జల్లేరు ప్రాజెక్టులకు పెద్దఎత్తున చేరుతున్న వరదనీరు దిగువన గ్రామ ప్రజలకు కునుకు లేకుండా చేస్తోంది. గడిచిన వారం రోజులుగా జిల్లాను వర్షాలు వెంటాడుతున్నాయి. దీనికితోడు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉరకలు వేస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఒక్కరోజులో 51 అడుగులకు చేరడంతో అంతటా ఆందోళన నెలకొంది. గురువారం కొంత తగ్గుముఖం పట్టి 48 అడుగులకు చేరినప్పటికీ పరిస్థితి మాత్రం ఇంకా ఆందోళన రేకెత్తిస్తూనే ఉంది. పోలవరం ఎగువ కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 34 మీటర్లు దాటింది. దీంతో దిగువకు 11.78 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరదకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో కుక్కునూరు ఎ బ్లాక్‌కు చెందిన దాదాపు 200 కుటుంబాలు గురువారం కివ్వాక పునరావాస కాలనీకి తరలివెళ్లాయి. ఇప్పటికే గొమ్ముగూడెం, రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన ప్రజలు రావికుంట పునరావాస కాలనీకి చేరారు. కుక్కునూరు మండలంలో కొండిన్యముక్తి గ్రామంతోపాటు, వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలను గురువారం పునరావాస కాలనీలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ గోదావరి తగ్గుముఖం పట్టడంతో తాత్కాలికంగా ఆ ప్రక్రియ నిలిపివేశారు. దాచారం, కుక్కునూరు, ముత్యాలంపాడు, వింజరం, సీతారాంనగరం, శ్రీధర్ గ్రామాల మధ్య కాజ్‌వేలు నీట మునగడంతో 20 గ్రామాలకుపైగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలేరు, బూర్గంపాడు మధ్యలో ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో భద్రాచలం వెళ్లే బస్సులు కుక్కునూరు నుంచి వెనక్కి తిరుగుముఖం పడుతున్నాయి. వరద భయంతో ఏజెన్సీ ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. కాపర్‌డ్యామ్ ప్రభావంతో ఒక్కసారిగా వరద ఉధృతి పెరుగుతున్న తీరు అందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

జల్లేరు, తమ్మిలేరు, ఎర్రకాల్వ ప్రాజెక్టు దిగువ గ్రామాలకు వరద హెచ్చరికలు

ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్‌కు పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. దీంతో దిగువకు నీరు విడుదల చేయాల్సి ఉంటుందని, ప్రాజెక్టు దిగువన ఉన్న చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాల రెవెన్యూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. తమ్మిలేరు రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 355 అడుగులు కాగా ప్రస్తుతం 345 అడుగులకు వరద నీరు చేరింది. ప్రస్తుతం 3,600 క్యూసెక్కుల నీరు వచ్చిపడుతోంది. దీంతో ఏక్షణమైనా గేట్లు ఎత్తి దిగువకు వరద నీరు విడుదల చేయనున్నారు. ఏజెన్సీలోని జల్లేరు రిజర్వాయర్ ప్రాజెక్టు, ఎర్రకాల్వ ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వస్తోంది. దిగువకు నీరు విడుదలచేస్తే జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు ప్రాంతాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. జల్లేరు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 217 మీటర్లు. ప్రస్తుతం 215 మీటర్లకు వరదనీరు చేరింది. ప్రస్తుతం 238 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి వస్తోంది. తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి వరదనీరు దిగువకు విడుదల చేస్తే జిల్లా కేంద్రం ఏలూరును సైతం వరద నీరు చుట్టుముట్టనుంది. దీంతో ఏలూరు నగర ప్రజల్లోనూ గుబులు నెలకొంది.



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పేద విద్యార్థుల కోసమే విదేశీ విద్యా దీవెన

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న విదేశీ విద్యాదీవెన నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి అర్హులైన 357 మంది విద్యార్థులకు రూ.45.53 కోట్లు గురువారం ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేశారు. దీనిలో భాగంగా స్థానిక కలెక్టరేట్లో జగనన్న విదేశీ విద్యాదీవెన ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ ప్రశాంతి, సంబంధిత అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే టాప్ యూనివర్సిటీల్లో మన విద్యార్థులు ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలబడటం చారిత్రాత్మకమని అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా పేద విద్యార్థులకు విదేశీ చదువుకు ప్రభుత్వం పూర్తి ఆర్థిక సహాయం అందిస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లాకు చెందిన 11 మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు రూ.85.88 లక్షల నమూనా చెక్కును కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి గణపతి రావు, సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేయాలి

పేదల సొంతింటి కల సాకారానికి గృహనిర్మాణ శాఖాధికారులు కష్టపడి పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆమె గృహనిర్మాణ శాఖాధికారులతో వివిధ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చిన్నచిన్న ఇబ్బందులను అధిగమిస్తూ గృహ నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. గృహ నిర్మాణాలను పూర్తి చేసి ఇచ్చినప్పుడే లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చిన వారమవుతామన్నారు. అందరికీ సొంతిల్లు ఉంటే బాగుండు అనే కోరిక ఉంటుందని, దాన్ని మీ ద్వారా నెరవేర్చాలని అన్నారు. జిల్లా మొత్తం 71,283 గృహ నిర్మాణాలు లక్ష్యమవ్వగా ఇప్పటికే 23,961 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. 11,778 ఇళ్లు పునాది, ఆపైన స్టేజిల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. దాదాపు నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చిన్న, చిన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. నరసాపురం లేఅవుట్‌లో వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని లేవుట్ల రహదారులు రాకపోకలకు అనుగుణంగా అవసరమైతే శిధిలాల మట్టిని (డ్రెబీస్) తొలించాలని ఆదేశించారు. లేఅవుట్ల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భీమవరం, నరసాపురం లేఅవుట్లకు ప్రత్యేక అధికారులుగా ఆయా మున్సిపల్ కమిషనర్లను, తణుకు లేఅవుట్‌కు మున్సిపల్ డిఇని, పాలకొల్లు లేఅవుట్‌కు తహశీల్దార్‌ను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, డిఇ బి.పిచ్చయ్య, ఇఇలు బివి.రమణ, వేణుగోపాల్, డిఇలు పాల్గొన్నారు.

వణుకుతున్న లంకలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని కోడేరు వద్ద వశిష్ట గోదావరి వరద ఉధృతి గురువారం మధ్యాహ్నం నుంచి క్రమేపీ పెరుగుతోంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో గోదావరి వరద ఉధృతి పెరిగింది. ధవళేశ్వరం నుంచి దిగువకు సుమారు 5 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేయడంతో నియోజవర్గ పరిధిలోని గోదావరి పోటెత్తుతోంది. మండలంలోని పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర్‌ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి. గంట గంటకు నీటి ప్రవాహం పెరగడంతో గోదావరిపై నాటు పడవల్లో రాకపోకలను అధికారులు నిషేధించారు. పుష్కరఘాట్ల వద్ద ఆచంట ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ ఆధ్వర్యాన హెచ్చరిక బోర్డులు పెట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ సుబ్రహ్మణ్యం గురువారం నది పరివాహక గ్రామాల్లో పర్యటించారు. నది మధ్యలో ఉన్న అయోధ్యలంక, ఆనగార్లలంక, కోడేరు పల్లిపాలెం, పుచ్చల్లంక, రాయిలంక, మర్రిమూల గ్రామాలకు వరద ప్రమాదం పొంచి ఉంది. ఆ గ్రామాల్లో రెవెన్యూ, ఇతర సిబ్బందిని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివశిస్తున్న వారిని అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ సూచించారు. భీమలాపురం పంచాయతీ పరిధి కాపులపాలెం ఏటిగట్టు దిగువన ఉన్న సుమారు వంద కుటుంబాలు వారు అప్రమత్తంగా ఉండాలదాయన హెచ్చరించారు.

కనకాయలంకలో పడవలపై రాకపోకలు



కరుగోరుమిల్లి, భీమలాపురం మధ్యలో పల్లపు లంక భూముల్లోకి వరద నీరు నెమ్మదిగా ప్రవేశిస్తుంది. లంక గ్రామాల్లో అరటి, కొబ్బరి, మునగ, బెండ, బీర, ఆనపకాయ, దోస, తమలపాకు వంటి ముఖ్యమైన పంటలు సాగవుతున్నాయి. వరద నేపథ్యంలో కోతకు వచ్చే పంటలు నీటి పాలవుతాయని లంక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువులను సురక్షిత ప్రాంతాలైన ఏటిగట్టుకు తరలిస్తున్నారు.

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నక్కల, తాడేరు డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆచంట, పెనుమంచిలి, వేమవరం గ్రామాల పరిధిలోని పంట పొలాలు నీట మునిగాయి. డ్రెయిన్ సమీపంలోని పంట పొలాలన్నీ జలాశయాలను తలపిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి భారీగా మురుగునీరు రావడంతో పంట పొలాల్లో సుమారు మూడు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. రెండు రోజుల నుంచి నాట్లు నీటిలో నానుతున్నాయని రైతులు వాపోయారు. మండలంలో 3,500 ఎకరాల్లో నాట్లు వేయగా వీటిలో సుమారు 1400 ఎకరాల వరకు నీట మునిగినట్లు అధికారులు చెబుతున్నారు. గురువారం మండలంలో చెదురుమదురుగానే వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పెనుగొండ: గోదావరి ఉధృతితో లంక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. సిద్ధాంతం, నడిపూడిలంక రైతులు పాలు, కూరగాయల కోసం లంకలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం లంకలకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

యలమంచిలి: ఎగువ ప్రాంతాల నుండి భారీగా వరద నీరు వస్తుండటంతో మండలంలో పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలిలంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి పర్వాలేదని, ఏదైనా ఇబ్బంది ఉంటే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తహశీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు



భీమవరంలో నినదిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ఆగస్టు పదో తేదీలోగా పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడతామని భీమవరం డివిజన్ జెఎసి జనరల్ సెక్రటరీ, ఎడిఇ రాజగోపాల్‌చౌదరి హెచ్చరించారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోసం భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు గురువారం డిఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌చౌదరి మాట్లాడుతూ 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి కొత్త పిఆర్‌సి అమలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు అమలు చేయలేదని, ప్రయివేట్ వ్యక్తిని నియమించడంపై తాము అభ్యంతరం వ్యక్తం చేశామని తెలిపారు. ఎస్ఒబి నిబంధనలను అమలు చేస్తూ కొన్ని సంవత్సరాలుగా రిక్రూట్‌మెంట్ చేపట్టడం లేదని, పని భారంతో ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నామని చెప్పారు. మూడు డిఎ బకాయిలు ఉన్నాయని వాటిని కూడా చెల్లించడం లేదని ఆయన వివరించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



నరసాపురంలో..

నరసాపురం టౌన్: విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు నరసాపురం డివిజన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ ఉద్యోగులు గురువారం మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి జెఎసి ఛైర్మన్ గుబ్బల శ్రీకాంత్ మాట్లాడగా కన్వీనర్ ఘంటసాల వెంటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఓంకారం, కోశాధికారి అంతర్వేది షణ్ముఖరావు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: జెఎసి ఆధ్వర్యంలో విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గురువారం స్థానిక ట్రాన్స్‌కో డిఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

మణిపూర్‌లో అరాచకాలపై నిరసనల వెల్లువ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

మణిపూర్ మారణహోమానికి తక్షణం అడ్డుకుని, మహిళలపై అకృత్యాలకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం పెంటపాడు మండల కమిటీ ఆధ్వర్యాన పట్టణంలోని ఉల్లిపాయల మార్కెట్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ రెండున్నర మాసాల నుంచి మణిపూర్‌లోని బిజెపి ప్రభుత్వం ఆ రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చిందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. దీనిపై రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన నోరుమెదపకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నాయకులు సిరపరపు రంగారావు, చల్లా చంద్రరావు, బంకురు నాగేశ్వరరావు, అల్లు సుబ్బారావు, కేదిరెడ్డి అప్పన్న, గొర్రెల శ్రీను, కరక వెంకట్రావు, సిరపు గణేష్, వెన్నెల శ్రీను, బేత అప్పారావు, ఎస్.మహేష్, వర్రె జోగి పాల్గొన్నారు.

భీమవరం రూరల్: మణిపూర్‌లో హింసాకాండను నిలువరించి శాంతి నెలకొల్పాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం వెంప బస్టాండ్ సెంటర్లో పెద్దపేట అంబేద్కర్ విగ్రహం దగ్గర మణిపూర్‌లో మారణహోమంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మణిపూర్ సిఎం బీరేన్‌సింగ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ మౌనం వీడకపోతే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్ధనపు కనుమదాసు, చిలకపాటి పౌలు, భూపతి సామ్యేలు, వర్ధన్, పండు, మంద మార్తమ్మ పాల్గొన్నారు.

గణపవరం: మణిపూర్‌లో మారణహోమాన్ని ఖండిస్తూ కెవిపిఎస్, ఆలిండియా దళిత రైట్‌ఫోరం, అంబేద్కర్ ఇండియన్ మిషన్, సిఐటియు ఆధ్వర్యంలో గురువారం కేశవరం మల్లప్పరాజు పేట సెంటర్లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో చిన్నం చిననాగేశ్వరరావు, మేడిశెట్టి పెంటారావు మాట్లాడగా కేతా శ్రీను, పి.సత్య, ఆంజనేయులు, ఎం.సాయి, ఎం.మహేష్, కేతా మురళీ, ఎన్.సత్యానందం, ఎం.అశోక్ పాల్గొన్నారు.

పాలకొల్లు: మణిపూర్‌లో మారణహోమాన్ని వెంటనే ఆపాలని సిఐటియు నాయకులు దేవ సుధాకర్ కోరారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి సెంటర్లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడగా నేతలు సిహెచ్.లక్ష్మీ, బి.జానకీ, వై.వెంకటలక్ష్మి, ఎన్.నాగదుర్గ, కనకవల్లి, బి.సూర్యావతి, ఎస్.వెంకట రమణ, కె.లక్ష్మి, టి.దేవి, మునికుమారి, నాగమణి పాల్గొన్నారు.

మొగల్తూరు: మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపే చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు యడ్ల చిట్టిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వీరా పాండురంగారావు, కొత్తపల్లి నాగరాజు, చిలకలపూడి నాగేశ్వరరావు, అద్దాల ఏడుకొండలు, చల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..

కాంగ్రెస్ ఆధ్వర్యాన..

ఉండి: మణిపూర్‌లో శాంతిభద్రతలను పరిరక్షించి దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. గురువారం ఉండి మెయిన్ సెంటర్‌లో కాంగ్రెస్ స్తూపం వద్ద ఆ పార్టీ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు తొలుత ఇందిరాగాంధీ రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లను అదుపు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కేంద్ర, మణిపూర్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మణిపూర్ మారణహోమంపై మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు నోరు మెదపకుండా బిజెపికి వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సోడదాసి గంగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆగస్టులో విద్యార్థులకు 'సృజన' శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

హైస్కూల్ విద్యార్థులకు ప్రకృతి, పరిసరాల పరిశీలన, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి 'సృజన' బాలవికాస శిక్షణ కార్యక్రమం ఆగస్టు నుంచి వంద వికాస పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వపరంగా సైన్స్‌పార్క్ ఏర్పాటుకు సహకారం అందిస్తారని, 2002లో ఏలూరులో ఇదేవిధంగా బాలయోగి సైన్స్ పార్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అమృత్ 2.0 కింద రూ.286.54 కోట్లు

ప్రజాశక్తి - భీమవరం



అమృత్ 2.0 పథకం కింద జిల్లాలో నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్వహణ పనులకు రూ.286.54 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) 2.0 పథకం కింద జిల్లాలో ఆకివీడు, నరసాపురం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సిటీ వాటర్ బ్యాలెన్స్ ప్లాన్‌లో గుర్తించిన ప్రాజెక్టుల ఆధారంగా నీటి వృత్తాకార ఆర్థిక వ్యవస్థ ద్వారా నగరాలను 'నీటి సురక్షితం'గా మార్చాలని మిషన్ భావిస్తోందని పేర్కొన్నారు. ఫంక్షనల్ వాటర్ ట్యాప్ కనెక్షన్లు, శుద్ధి చేసిన మురుగునీటిని రీసైకిల్ చేయడం, పునర్వినియోగం, నీటి వనరుల పునరుజ్జీవం, నీటి సంరక్షణపై దృష్టి సారిస్తుందని తెలిపారు.

ప్రాధాన్యతా ప్రకారం నిధుల కేటాయింపు

తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెం జగనన్న కాలనీల్లో నీటి సరఫరా ఏర్పాట్ల నిమిత్తం రూ.18.26 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆకివీడులో నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.5.92 కోట్లు, రూ.26.50 కోట్ల వ్యయంతో మరో రెండు పనులు చేయనున్నట్లు తెలిపారు. నరసాపురం పట్టణంలో నీటి సరఫరా అభివృద్ధి పనుల నిమిత్తం రూ.21 కోట్లు, భీమవరం పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలు, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, ప్రతిపాదిత ప్రాంతాల్లో నిరంతర నీటి సరఫరా ఏర్పాట్లకు రూ.47.29 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో నీటి సరఫరా అభివృద్ధి పనుల నిమిత్తం రూ.41.79 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. భీమవరం పట్టణంలో జగనన్న కాలనీలో

తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల మెరుగుకు ప్రత్యేక చర్యలు

భీమవరం, తాడేపల్లిగూడేనికి తొలి ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఎస్‌టిపి నిర్మాణానికి రూ.13.39 కోట్లు, తాడేపల్లిగూడెం జగనన్న కాలనీలో ఎస్‌టిపి నిర్మాణానికి రూ.12.19 కోట్లు, తాడేపల్లిగూడెం పట్టణంలో ఎస్‌టిపి నిర్మాణ పనులకు రూ.100.2 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. నిధుల వినియోగానికి పరిపాలనా ఆమోదం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. డిపిఆర్ ఆమోదం పొందిన వెంటనే టెండర్ల ప్రక్రియ ఆగస్టులో ప్రారంభం అవుతుందని తెలిపారు. నీటి సరఫరా రంగాల్లో ప్రాథమిక, మౌళిక సదుపాయాల అభివృద్ధిపై మిషన్ దృష్టి సారించిందని పేర్కొన్నారు.

ఈ రోడ్డు సొగసు చూడతరమా..!



మండల కేంద్రమైన ఉండిలో జాతీయ రహదారి 165 పరిస్థితి ఇది.ఉండి పడవలవాని పేట నుంచి కుర్మా వారి వీధి రహదారి అడుగడుగునా గుంతల మయం కావడంతో రాకపోకలకు జనం బెంబేలెత్తుతున్నారు.
- ప్రజాశక్తి, ఉండి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డిఇఒ

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి : డిఇఒ

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థులు విద్యనభ్యసించడంతోపాటు నైతికత విలువలు, క్రమశిక్షణ అత్యంత ప్రధానమని, అటువంటి విలువలతో కూడిన విద్యనభ్యసించి లక్ష్యాన్ని ఎంచుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్‌వి.రమణ సూచించారు. ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో ముందుగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎం.పోతరాజు అధ్యక్షతన జరిగిన సభలో డిఇఒ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులను, గురువులను దైవసమానులుగా చూడాలన్నారు. పాఠశాలలను దేవాలయాలుగా భావించాలన్నారు. ప్రతి విద్యార్థి ఎదుగుదల భవిష్యత్తులో తనతో పాటు సమాజానికి కూడా ఉపయోగపడాలన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం అత్యంత అవసరం అన్నారు. విద్యార్థులు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎ.రవీంద్ర, లయన్స్ జోన్ ఛైర్మన్ పల్లి రంగారెడ్డి, లయన్స్ ఆర్‌సి దాట్ల రామరాజు, నగర పంచాయతీ ఛైర్ పర్సన్ జామి హైమావతి, రైమ్స్ మాజీ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది నెల్లి సతీష్ మాట్లాడారు.

మహిళాశక్తితో రాజకీయాల్లో పెనుమార్పు

ప్రజాశక్తి - పాలకొల్లు

మహిళా శక్తితోనే రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పు రాబోతోందని టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేని రోజా రమణి అన్నారు. పట్టణంలోని - 1, 2 వార్డుల్లో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా నేతలు ఇంటింటికీ తిరుగుతూ మహాశక్తి కరపత్రాలను పంచిపెట్టారు. టిడిపితోనే మహిళా సాధికారత సాధ్యమన్నారు. టిడిపి మహిళలకు రక్షణ కవచంలా పనిచేసేదని, నేటి వైసిపి హయాంలో మహిళలు బయటకు వచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రాన్ని ముందుకు నడిపించడానికి మహిళాశక్తి కృషి చేయాలని తెలుగు మహిళా పట్టణ అధ్యక్షురాలు దబ్బా ఎస్తేరు రాణి అన్నారు. ఈ కార్యక్రమంలో జివి, పెచ్చెట్టి బాబు, వల్లభ నారాయణ మూర్తి, కర్నేన గౌరునాయుడు, పిసిని రాము, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

ఐటిడిపి జిల్లా అధ్యక్షునిగా చంద్రశేఖర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఐటిడిపి జిల్లా అధ్యక్షునిగా భీమవరం పట్టణానికి చెందిన ఉప్పులూరి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఆచంటకు చెందిన బైరిశెట్టి ప్రవీణ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా యశోదకృష్ణ నియమితులయ్యారని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ ఐటిడిపి జిల్లా రాష్ట్ర కమిటీలు టిడిపికి అత్యంత కీలకమన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు, మండల, పట్టణ ఐటిడిపి కమిటీలను పునరుద్ధరించాలని దిశా నిర్దేశం చేశారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం : సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో ఉందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఒక్కో రైతుకు రూ.లక్షా 50 వేలు లబ్ధి చేకూరగా, జగన్ హయాంలో రైతు భరోసా పేరుతో రూ.37,500 కొద్ది మంది రైతులకు ఇస్తూ వారిని దగా చేశారన్నారు. చంద్రన్న పాలనలో రైతులకు వారం రోజుల్లో ధాన్యం బకాయిలు చెల్లించే వారిని, జగన్ పాలనలో నెలలు గడుస్తున్న ధాన్యం బకాయిలు చెల్లింపులు జరగడం లేదన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థుల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతం తెలిపే పరీక్షలు నిర్వహించి, రక్తం పెరగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగమణెమ్మ, లలిత, వాణి, హెల్త్ అసిస్టెంట్ వైఎస్ఆర్ గోపాలకృష్ణ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పాలకోడేరులో సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు సచివాలయం వద్ద సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి ఇంజేటి మరియమ్మ అధ్యక్షత వహించగా తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎస్ఐ నాళం శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళీగంగాధర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలను ఏ ఒక్కరూ చేతిలోకి తీసుకోకూడదన్నారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, పిఒఎ అట్రాసిటీ యాక్టు ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని కోరారు. అట్రాసిటీ కేసుల నమోదులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దళితపేటలో సమస్యలు కోకొల్లగా ఉన్నాయని, వాటన్నింటినీ అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాలీల, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఇఒ శారదాజోత్స్న దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉపాధ్యాయులు తన ప్రావీణ్యంతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాలని ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆమె బదిలీపై వెళ్లిన సందర్భంగా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రస్తుత ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు అధ్యక్షతన శారదా జ్యోత్స్నను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు వక్తలు ఆమెతో ఉన్న సత్సంబంధాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శారదా జ్యోత్స్న మాట్లాడుతూ మండలం పుట్టిల్లు వంటిదన్నారు. ప్రతి ఒక్కరూ కష్టకాలంలో కూడా సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం శారదాజ్యోత్స్న, నరేంద్ర దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ఉపాధ్యాయ బృందం ఎన్.రామ్మోహనరావు, కె.రాంబాబు, కె.కాశీవిశ్వనాథం, కె.సాయిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు డాక్టర్ సబిత ఉమెన్స్ జూనియర్ కాలేజీలో డాక్టర్ బాబ్జి పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన డ్రాయింగ్, వకృత్వ, వ్యాసరచన పోటీల్లో పాలకొల్లు పరిసర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల నుంచి 200 మందికిపైగా విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దాల వాసు అన్నారు. ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యాసంస్థల అధినేత మద్దాల రాంప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎస్.వసంతలక్ష్మి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, రెండో పట్టణ సిఐగా బాధ్యతలు స్వీకరించిన గుత్తుల శ్రీనివాస్‌కు సూచించారు. బదిలీపై భీమవరం టు టౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన గుత్తుల శ్రీనివాస్ బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యంగా టుటౌన్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముంపులో జగనన్న కాలనీ..!

రెండడుగుల మేర చేరిన వర్షపు నీరు
బయటకు రాలేక మూడు రోజులుగా ఇళ్లలోనే
కాలనీ వాసుల ఆవేదన

ప్రజాశక్తి - ఆకివీడు

జగనన్న కాలనీ చెరువును తలపిస్తోంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీలో సుమారు రెండు అడుగుల నుంచి నాలుగు అడుగుల వరకూ వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సుమారు 3,300 మందికి పట్టాలిచ్చారు. అయితే 3,150 మందికి మాత్రమే ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకూ 1194 మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 150 ఇళ్ల నిర్మాణం పూర్తయి నివాసాలు ఉంటున్నారు. పలు గృహాలు ఇంకా నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే కాలనీలో మౌలిక సదుపాయాలు లేవు. కనీసం సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆకివీడు నుంచి జగనన్న కాలనీకి అర కిలోమీటరు దూరం ఉంటుంది. అయిభీమవరం, ఆకివీడు మధ్యలో కాలనీకి వెళ్లేందుకు ప్రత్యేకంగా వెంకయ్య కాలువపై వంతెన నిర్మించారు గానీ అప్రోచ్ రోడ్డు మరిచారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని ప్రభుత్వం అత్యవసర ఆదేశాలిచ్చిన నేపథ్యంలో తాత్కాలిక ప్రాతిపదికన వంతెనపై మట్టి రోడ్డు


తాళ్లకోడులో కొత్తగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో వర్షపు నీరు

ఏర్పాటు చేశారు. అయితే వర్షం పడితే చాలు బురదమయం. రైలింగ్ లేకపోవడంతో కాలనీకి వెళ్లాలంటే ఇక్కడ నిత్యం ప్రాణ సంకటంగానే ఉంది. ఇదిలా ఉంటే కురుస్తున్న వర్షాలకు కాలనీ మొత్తం చెరువును తలపిస్తోంది. దీంతో కాలనీ వాసులు ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కాలనీవాసులు నీళ్లల్లో నానుతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి. మరో పక్క పాములు, తేళ్లు వంటి విషసర్పాలతో భయంభయంగా కాలం గడుపుతున్నామని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు పోతే అంధకారమేనని వాపోతున్నారు. కాలనీలో నీరు నిలిచిపోవడంతో తాగునీటికి, నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

విషసర్పాలతో భయంగా ఉంది..

మజ్జాడ సావిత్రమ్మ



కాలనీలో అడుగు లోతు నీరు నిలిచిపోవడంతో భయం భయంగా ఉంది. బయటకు రాలేని పరిస్థితి. పురుగులు, పాములు వస్తున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో భయంగా ఉంది. నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. నీరు తోడించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

కాలనీ అంతా చెరువులా ఉంది..

ఆకుల ప్రసాద్



వర్షానికి జగనన్న కాలనీ మొత్తం చెరువులా మారింది. ఎక్కడ గుంట ఉందో అర్థం కావడం లేదు. కరెంట్ లేకపోతే ఇంటి దగ్గర పిల్లలు, ఆడవాళ్లు భయపడుతున్నారు. పిల్లలు బడికి వెళ్లే దారి లేదు. నీళ్లలో నడిచివెళ్లాలంటే భయమేస్తోంది. అధికారులు, పాలకులు స్పందిచాలి.

ప్రజల చెంతకే పరిపాలన : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

ప్రజల చెంతకే పరిపాలన తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం ఉండి కూనపరాజు అప్పలరాజు సీతమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పివిఎల్ నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టిముక్కల కళ్యాణ్ వర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు,


ఉండి : ప్రజలు సర్టిఫికెట్లు అందజేస్తున్న పివిఎల్

కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

పెనుమంట్ర: జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణలో పెనుమంట్ర మండలం జిల్లాలో ఐదో స్థానంలో నిలిచినట్లు ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సురక్ష పథకం ద్వారా మండలంలో ఆయా గ్రామ సచివాలయాల్లో 20, 150 సర్టిఫికెట్లను అర్హులకు అందించినట్లు తెలిపారు. వీటిలో పెనుమంట్ర-1లో 2,434 మంది అర్హులకు ధ్రువపత్రాలు అందించి ప్రథమ స్థానంలో, మాముడూరులో 1721 మందికి ధ్రువపత్రాలు అందించి ద్వితీయ స్థానంలో, పెనుమంట్ర-2లో 1,614 మందికి సర్టిఫికెట్లు అందించి తృతీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, సిబ్బంది సమన్వయంతో కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - గణపవరం

రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం అప్పన్నపేటలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరిచేలకు సోకే చీడపీడలకు అధికారుల సలహాలు తీసుకుని మందులు వాడితే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎడిఎ పి.మురళీకృష్ణ, ఎఒ వైవిఎస్.ప్రసాద్ మాట్లాడారు. వివిధ రకాల పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల మిత్రపురుగులకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నక్కా సూరి బంగారయ్య, ఎంపిటిసి కొల్లి సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.


గణపవరం : రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

ఆచంట : వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని ఎఇఒ బి.నాగరాజు అన్నారు. కొడమంచిలి పంచాయతీ పరిధి చినపేటలో గురువారం మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు మెరుగైన దిగుబడి కోసం అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. ఎఇఒ నాగరాజు మాట్లాడుతూ మిత్ర పురుగులను సంరక్షించుకోవాలని, రోజువారీ పొలం పరిశీలన వంటి కార్యక్రమాలు విధిగా చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగు మందులు తగిన మోతాదులో వాడాలన్నారు. తక్కువ పెట్టుబడితో వ్యవసాయం సాగు చేసేలా రైతులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కంది విత్తనాలను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు మన్నె సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, ఉపసర్పంచి ములగాడ వరప్రసాద్, వార్డు మెంబర్ కుసుమే నారాయణమూర్తి పాల్గొన్నారు.

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

ఎపిజె అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారాం అన్నారు. అబ్దుల్ కలాం 8వ వర్ధంతి సందర్భంగా కొడమంచిలి పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ యువత భవిత కోసం పరితపించిన గొప్ప సంఘ సంస్కర్త కలాం అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, ఉపసర్పంచి ములగాడ వరప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవిత సాఫల్య పురస్కారాలు విజయవాడ ఐలపురం కాన్ఫరెన్స్ హాల్లో కలాం వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా నుంచి ప్రముఖ సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, ప్రముఖ వాస్తు సిద్ధాంతి బ్రహ్మశ్రీ ర్యాలీ కృష్ణకు అందించారని పిలంత్ర ఫస్ట్ సొసైటీ విజయవాడ ఛైర్మన్ డాక్టర్ ఎ.రాజు తెలిపారు. వీరు ఇరువురు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డులను అందిస్తున్నామని తెలిపారు. అవార్డు అందుకున్న వారిని పట్టణ ప్రముఖులు అభినందించారు.

పాలకొల్లు : స్థానిక డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురంటౌన్ : స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బార్క్ సీనియర్ విశ్రాంత శాస్త్రవేత్త శ్రీ రంగినీడి సుబ్బారావు పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, సూర్యంబాబు, జీవన్, లక్ష్మి, దుర్గ, నారాయణ, శ్రీనివాస్, రాజు, హరినాథ్ పాల్గొన్నారు.

మొగల్తూరు : దేశానికి ఎనలేని సేవలందించిన ఘనత అబ్దుల్ కలాందే అని ఆరోగ్య వర్షిణి వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి నాయుడు రాంబాబు అన్నారు. ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో అబ్దుల్ కలాం వర్ధంతిని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధాన సహాయకులు గోపాలకృష్ణంరాజు, స్పందన, స్వర్ణలత, రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

కాళ్ల: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ, మహిళలపై అత్యాచారాలు, హత్యలకు నిరసనగా జక్కరం లూథరన్ ప్యారిస్ సంఘస్తులు ఖండించారు. జక్కరం గ్రామంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్యారిస్ డెలిగేట్ చిలకపాటి సుందర్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వివిధ మతాలు, తెగల మధ్య విద్వేష పూరిత హింసాకాండ చెలరేగుతోందన్నారు. ఈ హింసాకాండలో భాగంగా మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. వెంటనే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అల్ట్రా డెలిగేట్ దొండపాటి రవి చంద్రన్, జిడి.కరుణాకర్‌రావు, ఎం.ఇజ్రాయిల్, సంఘం పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం సభ్యులు

మత్స్యకారులను ఆదుకోవాలి

నరసాపురం టౌన్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని, తక్షణం ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని టిడిపి అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు, టిడిపి మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ గురువారం ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భారీ వర్షాలకు మత్యకారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. టిడిపి ప్రభుత్వం మత్స్యకారులకు 50 కేజీ బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి ఆదుకుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వారిని చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పడవలు, వలలు మత్స్యకారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లి పెద్దిరాజు, కొప్పాడి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్రావు, మురళి పాల్గొన్నారు.

నాగరాజు సేవలు ఎనలేనివి

మొగల్తూరు: టిడిపికి మాజీ జెడ్‌పిటిసి, మండల అధ్యక్షులు గొప్పలు నాగరాజు ఎనలేని సేవలందించారని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కొనియాడారు. గురువారం సాయంత్రం మొగల్తూరులోని నాగరాజు కార్యాలయం వద్ద ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలో టిడిపి జెండాను ఎగరవేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన కేకును నాగరాజు కోసి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయుడు రాంబాబు, బల్ల శ్రీను, కె.భోగరాజు పాల్గొన్నారు.

సిపిఎం నాయకురాలు మహాలక్ష్మి మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకురాలు యాండ్ర మహాలక్ష్మి గురువారం ఉదయం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహాలక్ష్మి అనారోగ్యం క్షీణించడంతో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు, జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, మండల కార్యదర్శి కానేటి బాలరాజు మహాలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ 1977 - 80 మధ్యకాలంలో చించినాడలో స్వాములకు, పేదలకు మధ్య జరిగిన మహాపోరాటంలో మహాలక్ష్మి పేదల పక్షాన దీశాలిగా నిలిచారని తెలిపారు. అదే స్ఫూర్తితో తుది శ్వాస విడిచే వరకూ ఆమె సిపిఎం సభ్యులుగా కొనసాగి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం ఆమె భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, చెల్లుబోయిన వడ్డికాసులు, తెన్నేటి స్టాలిన్, ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ, జిల్లెళ్ల ప్రశాంతి, నాగమణి, జయశ్రీ, ప్రియాంక పాల్గొన్నారు.


మహాలక్ష్మి భౌతిక కాయాన్ని సందర్శించిన సిపిఎం నేతలు

ముందస్తు చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎర్రకాలువకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ ప్రభావం యనమదుర్రు డ్రెయిన్‌పై పడుతోందని, వరద ప్రభావం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యనమదుర్రు డ్రెయిన్‌కు సంబంధించి ఎర్రకాలువ నుంచి వరద ప్రభావం ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో డ్రెయిన్ వెంబడి గట్టు పరిస్థితిని, అదే మాదిరిగా పట్టణంలో డ్రెయిన్‌కు ఉన్న అవుట్‌లెట్ ఇన్‌లెట్‌ను పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డిఇపి సత్యనారాయణ మూర్తి, ఎఇ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

తణుకు రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం ప్రజలకు కావాల్సిన రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేయడానికి రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిర్మాణాల కోసం తెచ్చుకున్న సామగ్రి పట్టుకొని వెళ్లడానికి ముప్పుతిప్పలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం అంటే ఇదేనా అని విమర్శించారు. ఇప్పటికీ ఇళ్లకు కరెంటు, తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని కోరారు.

3న ముస్లిం మైనార్టీ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి ఆధ్వర్యంలో జిల్లా ముస్లిం, మైనార్టీ ఆత్మీయ సమావేశం ఆగస్టు 3న భీమవరంలో బైపాస్ రోడ్డులోని శ్రీసత్యస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నామని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి కోరారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ కార్యాలయంలో గురువారం ఆహ్వాన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎండీ.గోరేబాబు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందజేసే వారిని, ప్రస్తుతం జగన్ పరిపాలనలో ముస్లిం కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నాయని, ఈ సమావేశంలో ముస్లిం సోదరులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.జాకీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.షాభు, నియోజకవర్గ అధ్యక్షుడు ఎండి ఖలీల్ పాల్గొన్నారు.

బియ్యం సేకరణ వేగవంతం చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

బియ్యం సేకరణ వేగవంతం చేయాలని సంబంధిత అధి కారులను జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేటులో బియ్యం సేకరణపై సంబంధిత అధికారులతో జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బియ్యం సేకరణ 4 లక్షల 25 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యం తీసుకోగా ఇప్పటివరకూ 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలిపారు. లక్ష్యాన్ని పూర్తి చేయడానికి క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేసి పక్కా ప్రణాళికతో వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా జిఎల్‌టి (గన్నీసు, లేబరు, ట్రాన్స్‌పోర్టు) సంబంధించి బకాయిలను కూడా త్వరితగతిన చెల్లించాలని జిల్లా కోఅపరేటివ్ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డిపో మేనేజర్ టి.శివరామప్రసాద్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిఎం కులదీప్ సిన్హా, డిసిఒఎ రవికుమార్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్, వ్యవసాయ శాఖ ఎఒ ప్రియదర్శిని పాల్గొన్నారు.

చేపల మేత లారీ బోల్తా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అదుపుతప్పి చేపల మేత లారీ యనమదుర్రు డ్రెయిన్‌లోకి బోల్తా పడిన ఘటన గురువారం భీమవరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో చెరువుల చేపలకు తమ్ముడు మేతను తీసుకొస్తున్న లారీ గొల్లవానితిప్ప రోడ్డు డిఎన్ఆర్ కళాశాల సమీపంలో యనమదుర్రు గట్టుపై నుండి వెళుతున్న లారీ అదుపుతప్పి డ్రెయిన్ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో గట్టు వెంబడి ఉన్న విద్యుత్ తీగలు తెగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - పాలకోడేరు

అస్సాం నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాలం శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

మహారాజశ్రీ మొదటి అదనపు జిల్లా జడ్జి (MACT) వారి కోర్టులో, ఏలూరు

I.A. No. 131/23, O.P. No. 850/19

Between:

నేకూరి లక్ష్మి -పిటీషనర్

AND

బొండాడ శ్రీనివాస్ అలియాస్ ఆటో శ్రీను (died) & వగైరాలు -రెస్పాండెంట్స్

ప్రపోజ్డ్ L.R. No-4:

బొండాడ నాగేశ్వరరావు, S/o. Not known, రెసిడెన్సీ ఆఫ్ దువ్వ గ్రామం, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా.

పై నంబరు గ్రంధంలో ప్రపోజ్డ్ LR 4వ రెస్పాండెంటుకి తమ కోర్టు ద్వారా పంపించిన సమనులు అవి తీసుకొనుటకు కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 21-8-2023వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించెదరు.

తణుకు **పి.రంగారావు**
28-7-23 పిటిషనర్ తరపు న్యాయవాది

In The Court Of The Senior Civil Judge :: Bhimavaram

I.A.No. 844/2023, O.S.No. 300/2006

Petitioner /Plaintiff:
Kopparti Veera Venkata Satyanarayana

Respondent /Defendants:
Adabala Bhavani and Others

5th Respondent:
Adabala Satyanarayana, S/o. (Late) Hanumantha Rao, R/o. Back Side of Municipal Library, Near Veeramma Pond, Bhimavaram-1.

పై నెంబరు ఎల్.ఆర్. పిటీషనులో ఐ.ఎ.844/2023లో పిటీషనరు, 5వ రెస్పాండెంటు అయిన మీకు నోటీసులు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను జారీ చేయించినప్పటికి 5వ రెస్పాండెంటు అయిన మీరు సదరు నోటీసులు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. సదరు పిటీషనులో 5వ రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమత్తం పై కోర్టు వారు సదరు పిటీషనును **ది.04-08-2023 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు 5వ రెస్పాండెంటు అయిన మీరు కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.** లేని ఎడల పై కోర్టు వారు సదరు పిటీషనును 5వ రెస్పాండెంటు అయిన మీ పరోక్షమందు తీర్మానించడమగును.

K.V.SURYANARAYANA
Advocate, Sarrajuvari Street,
Bhimavaram. Cell: 98494 04488